సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



సర్వే పేరుతో మోసం!

సర్వే పేరుతో ఓ నకిలీ అధికారి వరంగల్ రైల్వేగేట్ స్లమ్ ఏరియాలో పర్యటిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడు.

- 8లో▸



పరకాల కాంగ్రెస్‌లో వర్గపోరు

పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో కాంగ్రెస్ వర్గపోరు బట్టబయలైంది. ఎమ్మెల్యే రేవూరి, కొండా వర్గీయుల మధ్య గొడవ జరిగింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

40^0 /25^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో ఉక్కపోత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



కాజీపేట: రైల్వే పెన్షనర్స్ క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల్ని అంకితభావంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట సౌత్ సెంట్రల్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం పెన్షనర్లతో కలిసి డైరీని ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయిని మాట్లాడుతూ... పెన్షనర్లు ఎలాంటి సమస్య ఉన్నా.. నేరుగా తన వద్దకు వచ్చి పరిష్కారం పొందాలని కోరారు. సొంత ఖర్చులతో డైరీని ముద్రించి ఇచ్చిన కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌ను అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సంఘమయ్య, కేవీ.రావు, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, వేముల శ్రీనివాస్, ఎండి అంకూస్, సంఘం నాయకులు కె.అయిలయ్య, బి.యాదయ్య, ఎస్.రాములు, బి.వెంకటేశ్వర్లు, జహంగీర్, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ రద్దు

వరంగల్ అర్బన్ : బల్దియా కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ రద్దు చేసినట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది లోక్‌సభ ఎన్నికల విధుల్లో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని, నగర ప్రజలు గమనించి ఫిర్యాదులు సమర్పించేందుకు బల్దియా ప్రధాన కార్యాలయానికి రావొద్దని కోరారు.

నేటి నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

- జిల్లాలో 68,990 మంది విద్యార్థులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు సమ్మెటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఇప్పటికే విద్యాశాఖ పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 68,990 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లా పరీక్షల బోర్డు (డీసీఈబీ)సంబంధిత సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లు రూపొందించిన ప్రశ్నపత్రాలను అన్ని యాజమాన్యాల పాఠశాలలకు అందజేశారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నపత్రాలను కూడా ఒకేసారి అందజేశారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు పలువురు అధికారుల బృందాలను డీఈఓ ఎండీ అబ్దుల్‌హై ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ కో-ఆర్డినేటర్లు, కస్టోడియన్లు, ఎంఈఓలు, మండల నోడల్ ఆఫీసర్లు పాఠశాలలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షల అనంతరం పాఠశాలల వారీగా ఆయా ఉపాధ్యాయులు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఈనెల 23న ఫలితాలను తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి వెల్లడిస్తారు. ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేస్తారు. క్యూమిలేటివ్ రికార్డులో విద్యార్థులు ఫలితాలను నమోదు చేసి ప్రగతి పత్రాలను అందజేస్తారు. ఈనెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయి. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయి. ఇదిలా ఉండగా.. అన్ని ప్రైవేట్ పాఠశాలలు కూడా తప్పనిసరిగా ఈపరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.

ఇంకుడు గుంతలు.. కళ్లకు గంతలు

బల్దియాకు పట్టదు.. నిర్మాణదారులకు గిట్టదు

- భూగర్భ జలాల పెంపునకు చర్యలు శూన్యం
- పట్టించుకోని పాలక, అధికార వర్గాలు
- 12వేల భవనాల్లో రూ.8కోట్లు వసూలు
- ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్ నిర్మాణాల ఊసేలేదు
- జనరల్ ఫండ్‌కు నిధుల మళ్లింపు
- నీటిబొట్టు ఒడిసిపట్టేదెలా..?



వరంగల్ అర్బన్: నీటిని వృథా చేస్తే రాబోయే రోజుల్లో కన్నీళ్లు తప్పవు. భూగర్భంలోని నీటిని వాడుకోవడంతో పాటు ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టాలన్న గ్రేటర్ లక్ష్యం నీరుగారుతోంది. కొత్తగా భవనాలకు అనుమతినిచ్చే సమయంలో ఇంకుడు గుంతలు తవ్వించాల్సి ఉండగా టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యజమానులు ఇంకుడు గుంతలు తవ్వకోని పక్షంలో వారి నుంచి కొంత రుసుము తీసుకొని అధికారులే పల్లపు ప్రాంతాల్లో నిర్మించాలి. ప్రతి నివాసంలో ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయితే ప్రజల ఇళ్లు, భవనాల నిర్మాణదారుల నుంచి ఇంకుడు గుంతల పేరిట వసూలు చేసిన సొమ్మును జనరల్ ఫండ్‌కు మళ్లించడం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ మహానగరంలో 11 లక్షల మందికి పైగా జనాభా.. 2.25లక్షలకు పైగా ఇళ్లు ఉన్నాయి. కొత్త కాలనీలు వెలుస్తున్నాయి. బస్తీలు విస్తరిస్తున్నాయి. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం ఇబ్బడి ముబ్బడిగా జరుగుతోంది. నివాసాలు పెరిగేకొద్దీ వర్షపు నీరు భూమిలో ఇంకే ప్రాంతం తగ్గిపోతోంది. అభివృద్ధి పేరిట చెరువులు, బావులు అంతరించిపోవడం, చెట్లను నరికివేయడం, సిమెంట్‌రోడ్లు, డ్రెయినేజీలు, ఫ్లోరింగ్‌లతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశమే లేకుండా పోతోంది. దీనికి తోడు భూగర్భ జలాలను విపరీతంగా తోడేస్తుండడంతో బోర్లు, చేతి పంపులు ఎండిపోయి వేసవి కాలంలో నీటిని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ప్రత్యేక మార్గదర్శకాలు

జలశక్తి అభియాన్‌తో పాటు, వర్షపు నీటిని ఒడిసిపట్టడానికి చట్టాలున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం జలశక్తి కింద ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రదేశాలకు అనుగుణంగా మూడు రకాల ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. సాధారణ ఇళ్లల్లో వ్యర్థ నీటిని భూమిలోకి పంపేలా చర్యలు చేపట్టడానికి రూ.5వేలు, ఓ మోస్తరు ఇళ్లల్లో నిర్మించేందుకు రూ.12వేలు, ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్ భవనాలు, అపార్టుమెంట్లలో నిర్మించేందుకు రూ.26వేలుగా నిర్ణయించింది. ఈ నిర్మాణాల ఆధారంగా ఒక్కో చదరపు అడుగుకు రూ.15 చొప్పున వసూలు చేయాలని స్థానిక సంస్థలకు ఆదేశాలు ఉన్నాయి. కానీ బల్దియా చోద్యం చూస్తోంది.

'మహా' తొండి

మహా నగరపాలక సంస్థ ఇళ్లు, కమర్షియల్ భవనాల్లో ఇంకుడు గుంతల పేరుతో ఐదేళ్లుగా సొమ్ము వసూలు చేస్తోంది. ఇప్పటి వరకు 12వేల భవనాల్లో సుమారు రూ.8కోట్లు వసూలు చేసింది. అయినా ఎక్కడా ఇంకుడు గుంతలు నిర్మించింది లేదు. గ్రేటర్ ఇతర అవసరాల కోసం ఇంకుడు గుంతల సొమ్మును దారి మళ్లించి వాడుకుంది. కనీసం ప్రజల్లో అవగాహన కల్పించడం లేదు. సామాజిక బాధ్యతగా భవన నిర్మాణదారులు ముందుకు రావడం లేదు. 2012, 2013 సంవత్సరంలో అప్పటి కమిషనర్ వివేక్‌యాదవ్ ఇంకుడు గుంతలపై విస్తృత ప్రచారం చేపట్టారు. ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు 11,400 ఇళ్లు, భవనాలకు నోటీసులు జారీ చేశారు. దీంతో సుమారు 1,000 మంది ఇంకుడు గుంతలు నిర్మించుకున్నారు.



జీఓల అమలెక్కడ..?

వాతావరణంలో సమతుల్యతను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను రూపొందిస్తున్నాయి. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు అనేక రాయితీలు ఇస్తున్నాయి. మొక్కల పెంపకం, ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి చేస్తూ జీఓలు వచ్చాయి. అపార్టుమెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, భారీ భవంతులతోపాటు సాధారణ ఇళ్లల్లో ఇంకుడు గుంతలు నిర్మించేందుకు కచ్చితమైన నిబంధనలున్నాయి. జీఓ 168 తేదీ 07-04-2012 ప్రకారం ప్రతి అపార్టుమెంట్, కమర్షియల్ కాంపెక్స్‌లో ఇంకుడు గుంత(రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్) ఉండి తీరాలి. నిర్మించకపోయినా ఇంటిపన్నుపై పది శాతం అపరాధ రుసుం విధిస్తారు. ఇంకుడు గుంత ఏర్పాటు చేసే వరకు అపరాధ రుసుం వసూలు చేస్తారు.

అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శం



హనుమకొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



కాశిబుగ్గలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, కమిషనర్ తదితరులు

- వరంగల్, హనుమకొండ కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్

హనుమకొండ/కాశిబుగ్గ/వరంగల్ అర్బన్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శనీయమని వరంగల్, హనుమకొండ కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం నగరంతోపాటు రెండు జిల్లాల్లో ప్రభుత్వ, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లోని అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాశిబుగ్గ జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి భాగ్యలక్ష్మి, డీఆర్‌డీఓ కౌసల్యా దేవి, జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఎమ్మెస్పీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బల్దియా కార్యాలయంలో...

బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కౌన్సిల్ హాల్లో జేఏసీ ప్రధాన కార్యదర్శి గోల్కొండ శ్రీను అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జేఏసీ అధ్యక్షుడు గౌరీ శంకర్, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, పీఆర్ఓ అయూబ్ అలీ, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హార్టికల్చర్ అధికారి రమేశ్, ఈఈ సంజయ్‌కుమార్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం

- ఏసీపీ విజయ్‌కుమార్
- పబ్లిక్‌గార్డెన్‌లో డ్రాయింగ్ పోటీలు

హన్మకొండ చౌరస్తా: పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని వరంగల్ సైబర్‌క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్ అన్నారు. సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ, రోజా క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో చార్లీ చాప్లిన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈపోటీలకు ఏసీపీ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవులను మొబైల్ ఫోన్లు, టీవీలు చూస్తూ వృథా చేయొద్దని సూచించారు. పిల్లలకు డ్రాయింగ్ శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల, రోజా క్రియేషన్స్ డైరెక్టర్ ఆలేటి శ్యామ్‌సుందర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత, పద్మజ, అజయ్, సదాశివ, ధనలక్ష్మి, శ్రీధరాచార్యులు, అనిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో ఏసీపీ విజయ్, నిర్వాహకులు

టాటా ఐపీఎల్ ఫ్యాన్ పార్క్‌కు భారీ స్పందన



సీకేఎం కళాశాల మైదానంలోని ఐపీఎల్ ఫ్యాన్ పార్క్‌లో క్రికెట్ తిలకిస్తున్న నగరవాసులు

వరంగల్: వరంగల్‌లో టాటా ఐపీఎల్ ఫ్యాన్ పార్క్‌కు భారీ స్పందన వచ్చిందని బీసీసీఐ ప్రతినిధి ఆనంద్ దవే, డబ్ల్యూడీసీఏ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ అన్నారు. దేశాయిపేట సీకేఎం కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టాటా ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఆదివారంతో ముగిసింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రికెట్ ప్రేమికులకు స్టేడియంలో చూసిన ఆనందం అందించేందుకు ఈ ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరవాసులు అధిక సంఖ్యలో మైదానానికి వచ్చి మ్యాచ్ చూస్తూ ఎంజాయ్ చేసినట్లు పేర్కొన్నారు.

కష్టపడి పని చేస్తేనే భవిష్యత్

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను బొందపెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలి.. కష్టపడితేనే పార్టీలో భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని లలితా కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక పరకాల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, భూపాలపల్లి, పాలకుర్తి ఎమ్మెల్యేలు సత్యనారాయణరావు, యశస్వినిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. 'కూడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఏఐసీసీఓబీసీ మోర్చా అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ప్రతిష్టాత్మకం

అన్ని పార్టీల నేతలకు గెలుపే లక్ష్యం..

- ఎత్తులు.. పైఎత్తులతో వ్యూహాల రచన
- ఎన్నికల ఇన్‌చార్జ్‌లను నియమించిన బీజేపీ, కాంగ్రెస్
- బాలారిష్టాల్లో భారత రాష్ట్ర సమితి..



సాక్షిప్రతినిధి, వరంగల్: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఆయా పార్టీల ముఖ్య నాయకులు గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మక సమీకరణలపై దృష్టి సారించారు. పాత కొత్త తేడా లేకుండా కలిసొచ్చే నాయకులు, కార్యకర్తలను కలుపుకొనిపోయేందుకు సన్నద్ధమవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల కీలక నామినేషన్ల ఘట్టం ఈనెల 18న నోటిఫికేషన్‌తో మొదలు కానుంది. ఈ నేపథ్యంలో పార్టీల నాయకత్వం కేడర్‌ను అప్రమత్తం చేస్తున్నది. వరంగల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటు బ్యాంకును బేరీజు వేసుకుంటూ లోక్‌సభ ఎన్నికలకు అస్త్రశస్త్రాలతో నేతలు సమాయత్తం అవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలకు బీజేపీ, కాంగ్రెస్ ఇప్పటికే సీనియర్ నాయకులకు ఎన్నికల ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు అప్పగించాయి. ఊహించని పరిణామాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పుడిప్పుడే బాలారిష్టాలను అధిగమిస్తోంది.

ప్రచారంలో ఏకతాటిపైకి తెచ్చేలా..

వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు మూడు పార్టీల అభ్యర్థులు ఖరారు కాగా.. గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం నియోజకవర్గాల్లో నేతల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు, వర్గపోరు సమస్యను సరిచేసి ప్రచారంలో అందరినీ ఏకతాటిపైకి తెచ్చేలా పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. పార్టీలు మారినవారు పోను ఉన్న వారిని కలుపుకొని ముందుకెళ్తున్నారు. ఇదిలా ఉంటే స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరడంతో వరంగల్ లోక్‌సభ స్థానంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అందరూ కాంగ్రెస్ శాసనసభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషించడంతోపాటు పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్లను రాబట్టుకునే వ్యూహంలో అన్ని పార్టీలు తలమునకలై ఉన్నాయి.

అన్ని పార్టీలకు ఎన్నికల ఇన్‌చార్జ్‌లు

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ మరో మూడు రోజుల్లో విడుదల కానున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల ఇన్‌చార్జ్‌లపై భారం పెడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కాగానే కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లను నియమించింది. బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు ఇప్పటికే మూడు కీలక భేటీలు, పదాధికారులతో సమావేశాలు నిర్వహించింది. గులాబీ దళపతి కేసీఆర్ మహబూబాబాద్ ఎంపీ సీటును సిట్టింగ్‌కు, వరంగల్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించిన నేపథ్యంలో కావ్య, ఆమె తండ్రి కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరారు. కావ్యకు కాంగ్రెస్ టికెట్ ఇప్పించుకోవడంతో హనుమకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారపల్లి సుధీర్‌కుమార్‌ను రెండు రోజుల క్రితం వరంగల్ అభ్యర్థిగా ప్రకటించిన బీఆర్‌ఎస్ మళ్లీ ప్యాచప్ చేస్తోంది. రెండు పార్లమెంట్ స్థానాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు. ఆయా నేతలతో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతున్నారు. మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య తదితరులతో కేసీఆర్ ఈ మేరకు భేటీ అయ్యారు. ఇక కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మంత్రులు సురేఖ, సీతక్క ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులను సమన్వయం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ ముఖ్య నేతలు, నాయకులతో కలిసి ఇప్పటికే వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో తిరుగుతున్నారు.

ఉద్యానవనం ఉత్తదేనా?

చౌరస్తా.. కూరగాయల సంత

- వాహనాల పార్కింగ్‌తో అస్తవ్యస్తం
- దుర్గంధభరితంగా చంద్రబోస్ విగ్రహ పరిసరాలు
- హనుమకొండ చౌరస్తా అభివృద్ధిపై పాలకుల నిర్లక్ష్యం



హనుమకొండ చౌరస్తాలో ఒకవైపు పార్కింగ్ చేసిన వాహనాలు, మరోవైపు కూరగాయల విక్రయం

హన్మకొండ చౌరస్తా: సిటీకి గుండెకాయ వంటి స్థలమది. నిత్యం రద్దీగా ఉండే హనుమకొండ చౌరస్తాను అందమైన ఉద్యానవనంగా తీర్చిదిద్దుతామని అప్పటి పాలకులు హామీ ఇచ్చారు. నాటి పాలకులు, అధికారుల హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఆహ్లాదం పంచాల్సిన చౌరస్తా కూరగాయల సంతగా మారింది. ఓ వైపు కూరగాయలు అంగడి.. మరో వైపు వాహనాల పార్కింగ్‌తో చౌరస్తా అస్తవ్యస్తంగా మారింది. నగరంలోని ప్రధాన జంక్షన్లను అందంగా తీర్చిదిద్దుతున్నామని చెబుతున్న అధికారులు చౌరస్తాను విస్మరించడం బాధాకరం. ప్రతీ రోజు ఇదే చౌరస్తా మీదుగా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్తుంటారు. అయినప్పటికీ చౌరస్తా అభివృద్ధిని విస్మరించడంపై నగర ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు ఏడేళ్ల క్రితమే ప్రణాళిక..

హనుమకొండ చౌరస్తాను అందంగా తీర్చిదిద్దుతామని అప్పటి నగర మేయర్ నన్నపునేని నరేందర్.. మున్సిపల్, 'కుడా' ఇంజినీరింగ్ అధికారులతో కలిసి చౌరస్తాను పరిశీలించి ప్రణాళికను తయారు చేశారు. ఆర్నెళ్లలో చౌరస్తాను అద్భుతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అయితే మేయర్ కాస్త ఎమ్మెల్యే అయ్యాడు, ఆ తర్వాత పాలకవర్గం మ్యాప్‌ను మూలన పడేసింది. దాదాపు ఏడేళ్లు గడుస్తున్నా.. అడుగు కూడా ముందుకు పడలేదు.

ఏటా జయంతి ఉత్సవాలు..

1954లో నగర వీధికి చెందిన అప్పటి కౌన్సిలర్ తైలం యాదగిరి తన సొంత ఖర్చులతో హనుమకొండ చౌరస్తాలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి చంద్రబోస్ జయంతిని ఇక్కడ నిర్వహించడం ఆనవాయితీ. విగ్రహం చుట్టూ నాలుగు దశాబ్దాల క్రితం పార్కు ఏర్పాటు చేశారు. ఈపార్కులో స్థానికులు, బాటసారులు సేద తీరేవారు. దాదాపు ఏడు సంవత్సరాల క్రితం అభివృద్ధి పేరిట గ్రేటర్ మున్సిపల్ పాలకవర్గం కూల్చేసింది. కొద్ది రోజులు పాటు సుభాశ్ చంద్రబోస్ విగ్రహం నిరాధరణకు గురవగా.. స్థానికుల చొరవతో మళ్లీ గద్దెకట్టి నూతన విగ్రహాన్ని ప్రతిష్టించి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

కూరగాయల సంతగా..

పార్కు స్థలాన్ని పూర్తిగా చదును చేసి వదిలేయడంతో ఆ స్థలంలో మొదట్లో షాపింగ్‌కు వచ్చే వారు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండేవారు. అంతటితో ఆగకుండా రెండేళ్లుగా కూరగాయల సంతగా, చిరువ్యాపారుల దుకాణాలతో ఆ స్థలమంతా అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఇక్కడి పరిసరాలు దుర్గంధ భరితంగా మారాయి. చదును చేసిన స్థలంలో కూరగాయలు, చిరు దుకాణాలు, వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాత్రయిందంటే చాలు చిరుదుకాణాల మాటున మూత్ర విసర్జన చేస్తున్నారు. దుకాణాదారుల వ్యర్థాలు, చెత్త వేస్తుండడంతో చౌరస్తాకు గుండెకాయ వంటి ప్రాంతం కంపుకొడుతోంది.

ప్రత్యేక పూజలు

హన్మకొండ కల్చరల్: వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆరో రోజు వేయిస్తంభాల ఆలయంలో సీతారామ చంద్రస్వామికి పల్లకి సేవ నిర్వహించారు. భద్రకాళి ఆలయంలో అమ్మవారికి సెంటు గులాబీపూలతో అర్చన చేశారు. అదేవిధంగా వరంగల్ భద్రకాళి రోడ్‌లోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో ఆదివారం తమిళ ఉగాది(కేరళ విషు) సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భద్రకాళి అమ్మవారికి గులాబీలతో అర్చన



అయ్యప్పదేవాలయంలో స్వామివారికి అలంకరణ



వేయిస్తంభాల ఆలయంలో సీతారాముల వారికి పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

నీరుకుళ్లలో పునుగు పిల్లి


క్యాన్‌లో దాక్కున్న పునుగు పిల్లి

ఆత్మకూరు : అరుదుగా కనిపించే పునుగు పిల్లి మండలంలోని నీరుకుళ్లలో ప్రత్యక్షమైంది. శనివారం రాత్రి గ్రామానికి చెందిన పంచనేని రాజేశ్వర్‌రావు ఇంటి పరిసరాల్లోకి వచ్చి ఓ క్యాన్‌లోకి వెళ్లింది. దానిని కాపాడిన రాజేశ్వర్‌రావు.. ఆదివారం ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా, హనుమకొండలోని జూ పార్క్ సిబ్బంది.. నీరుకుళ్లలోని రాజేశ్వర్‌రావు ఇంటికి చేరుకుని పునుగు పిల్లిని తీసుకెళ్లారు. గతంలో కూడా నీరుకుళ్లలో పునుగు పిల్లి ప్రత్యక్షమైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ పిల్లి ఎక్కడి నుంచి వచ్చింది అనే అంశం చర్చనీయాంశమైంది.

పోలీసుల ప్రత్యేక తనిఖీలు

- 25 వాహనాల స్వాధీనం..జరిమానాలు


కాజీపేట చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సుధాకర్ రెడ్డి

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో ఆదివారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాలకు భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను బిగించుకుని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వాహనదారులపై జరిమానాలు విధించారు. సైలెన్సర్లను తొలగించి వాహనదారుల సొంత ఖర్చులతో కొత్తవి బిగింపజేశారు. సీఐ సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్సైలు శివకృష్ణ, లవన్ కుమార్, నవీన్‌కుమార్ లు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టడంతోపాటు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

సైలెన్సర్ మార్చి.. న్యూసెన్స్

- యువకుడిపై కేసు నమోదు

హసన్‌పర్తి: బైక్ సైలెన్సర్ మార్చి.. న్యూసెన్స్ చేస్తున్న ఓ యువకుడిపై ఆదివారం కేసు నమోదైంది. పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన విజయ్ తేజారెడ్డి తన బైక్‌కు సైలెన్సర్, హారన్ మార్చి శబ్ద కాలుష్యం చేస్తూ కరీంనగర్ నుంచి హనుమకొండ వైపునకు ర్యాష్ డ్రైవింగ్‌తో వస్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులు భీమారం వద్ద ఆపారు. వాహనం సైలెన్సర్, హారన్ మార్చినట్లు గుర్తించారు. ఈ మేరకు బైక్‌ను సీజ్ కేసి.. విజయ్‌తేజారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

అర్ధరాత్రి పీఎస్ తనిఖీ


ఇంతేజార్‌గంజ్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ

రామన్నపేట: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం అర్ధరాత్రి ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు డీసీపీ బారీ ఆధ్వర్యంలో.. రాత్రి పూట సైలెన్సర్ శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఐదు వాహనాల్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.



విద్యతోనే విజ్ఞానం, వికాసం

- ప్రపంచతత్వవేత్తల్లో అంబేడ్కర్ ఒకరు
- కేయూ వీసీ తాటికొండ రమేష్


కేయూ దూరవిద్య కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ


కాజీపేట అర్బన్: నిట్‌లో..

కేయూ క్యాంపస్: విద్యతోనే విజ్ఞానం, వికాసమని, ప్రపంచ తత్వవేత్తల్లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేడ్కర్ ఒకరని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. ఆదివారం కేయూలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ బాల్యం నుంచే వివక్షతకు గురయ్యారన్నారు. ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొని విద్యద్వారానే ఉన్నత స్థితిలోకి వచ్చిన అంబేడ్కర్ సేవలను నేటి యువత గుర్తుంచుకోవాలన్నారు. కేయూ దూరవిద్యాకేంద్రం మాజీ డైరెక్టర్ ఎం ఎర్రగట్టుస్వామి 'అంబేడ్కర్ థియరీ ప్రాక్టీసెస్' అనే అంశంపై కీలకపోన్యాసం చేస్తూ సామాజిక రుగ్మతలు పాలద్రోలేందుకు అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్ రాజమణి ,అసిస్టెంట్ రిజిస్ట్రార్ వల్లాల పృథ్వీరాజ్, ఆచార్యులు కృష్ణమాచార్య, సీహెచ్ సమ్మయ్య మాట్లాడారు. కాగా, కాకతీయ యూనివర్సిటీలో 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు డాక్టరేట్ పొందిన పరిశోధకులను అతిథులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేడ్కర్

హన్మకొండ: సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమాజం దిశగా భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లిన బహుముఖ ప్రజ్ఞాశాలి భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి సీఎండీ వరుణ్ రెడ్డి, ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, అధికారులు పూల మాల వేసి నివాళులర్పించారు. ముందు చూపుతో ఆలోచించి ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా రాజ్యాంగంలో సమాన హక్కులు పొందుపరిచిన తాత్వికవేత్త అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్‌లు బి.అశోక్ కుమార్, వి. మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, కంపెనీ సెక్రటరీ కె. వెంకటేశం, సీజీఎంలు సి.ప్రభాకర్, కిషన్, రాజుచౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.


హన్మకొండ: అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఎండీ

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

కాజీపేట అర్బన్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దామని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, నిట్ డీన్స్, ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం వరంగల్ నగరం, హనుమకొండ జిల్లాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. –సాక్షి నెట్‌వర్క్




అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



ఆర్టీసీ హనుమకొండ డిపోలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఎం ధరం సింగ్, ఉద్యోగులు, ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో జయంతి వేడుకలు ప్రారంభిస్తున్న ఆర్ఎం జాస్తి శ్రీలత


బల్దియాలో పూలమాల వేస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే..

సర్వే పేరుతో మోసం..!

- ఉచిత కరెంట్ బిల్లు లాగిన్ అంటూ డబ్బు దండుకుంటున్న నకిలీ అధికారి..
- పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు


శంభునిపేటలో నకిలీ సర్వే చేసిన వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

ఖిలా వరంగల్: సర్వే పేరుతో ఓ నకిలీ అధికారి వరంగల్ రైల్వేగేట్ స్లమ్ ఏరియాలో పర్యటిస్తున్నాడు. అమాయక ప్రజలను నమ్మించి అందిన కాడికి దుండుకుంటున్నాడు. ఈ దందా ఆదివారం శంభునిపేటలో వెలుగులోకి వచ్చింది. వరంగల్ శంభునిపేటలో సర్వే అధికారి వేషధారణతో ఓటర్ లిస్ట్ చేతపట్టి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో దేనికైనా దరఖాస్తు చేశారా..? చేస్తే జీరో కరెంట్ బిల్లు మీకు వస్తుందా..? పెన్షన్ కోసం దరఖాస్తు చేశారా..?గ్యాస్ సబ్సిడీ మీ అకౌంట్‌లో జమ అయ్యిందా..? అంటూ స్థానికులను కలిసి పలు ప్రశ్నలు వేస్తున్నాడు. ఈ క్రమంలో మీకు జీరో కరెంట్ బిల్లు రాలేదా..?అయితే నేను నమోదు చేస్తానంటూ అమాయకులను నమ్మించి ఆధార్, కరెంట్ బిల్లు తీసుకుని ఓటీపీ మీ మొబైల్‌కు వచ్చింది చెప్పండంటూ వచ్చిన ఓటీపీ చెప్పిన వెంటనే యువర్ ఆధార్ అప్‌డేట్ (సక్సెస్ ఫుల్) అని రాగానే దీనినే చూపించి రూ.100 నుంచి రూ.200 వరకు లాగేస్తున్నాడు. ఈ నయా దందా వారం రోజుల నుంచి కొనసాగుతున్నట్లు తెలిసింది. అతడిపై అనుమానం చెందిన స్థానికులు వెంటనే స్థానిక కాంగ్రెస్ నేతలు షేక్ మున్వీర్, ఎండీ జమీల్, మంద సన్నీకి సమాచారం అందజేశారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని ఏ అంశంపై సర్వే చేస్తున్నావో స్పష్టంగా చెప్పాలని నకిలీ సర్వే అధికారిని నిలదీశారు. సరైన సమాధానం రాకపోవడంతో పట్టుకుని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు స్థానిక కాంగ్రెస్ నేతలు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మహబూబాబాద్ జిల్లా గూడూరులో వ్యక్తి, వరంగల్ జిల్లా నర్సంపేటలో యువకుడు, జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఫతేషాపూర్‌లో వ్యక్తి ఉరివేసుకుని బలవన్మరణం చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.


వెంకటేశ్ మృతదేహం

గూడూరు: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం గూడూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొంత వెంకటేశ్ (35) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఇసుక వ్యాపారం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. వ్యాపారం కోసం, ట్రాక్టర్ కొనడానికి అప్పు చేశాడు. వ్యాపారం కలిసి రాక అప్పు పెరిగింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేశ్.. హైదరాబాద్ నుంచి గూడూరుకు చేరుకున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అప్పుల బాధతో ఉరి వేసుకొని చనిపోతున్నా అని కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు కుమారుడు మృతి చెందడం చూసి బోరున విలపించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉంది.

నర్సంపేటలో యువకుడు..

నర్సంపేట రూరల్ : అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నర్సంపేటలో చోటు చేసుకుంది. టౌన్ సీఐ రమణమూర్తి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన సంపంగి వెంకటేశ్వర్లు (30) సర్వాపురంలో సిమెంట్ బ్రిక్స్ తయారీ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే కొంతకాలంగా అప్పులు అయ్యాయని కుటుంబ సభ్యులతో చెప్పి తరచూ మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన తల్లి విజయమ్మ.. ఇంట్లోకి వెళ్లి చూడగా వెంకటేశ్వర్లు ఉరివేసుకుని కనిపించాడు. దీంతో కేకలు వేయగా స్థానికులు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లావణ్య ఉంది. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


వెంకటేశ్వర్లు (ఫైల్)

ఫతేషాపూర్‌లో కుటుంబ కలహాలతో వ్యక్తి..

రఘునాథపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఫతేషాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ అఫ్జల్ (59)కు భార్య, కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ క్రమంలో కొన్ని రోజుల నుంచి దంపతులు మధ్య కలహాలు చోటు చేసుకున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అఫ్జల్.. శనివారం నిడిగొండ అన్నంకుంట వద్ద పురుగుల మందు తాగాడు. తాను చనిపోతున్నట్లు అల్లుడికి ఫోన్ చేసి తెలిపాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని అఫ్జల్‌ను వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

- రెడ్డిపురం కుంటలో ఘటన


వాజీద్ మృతదేహం

హసన్‌పర్తి: స్నేహితులతో కలిసి కుంటలో ఈతకు వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం కేయూ పీఎస్ పరిధిలోని రెడ్డిపురంకుంటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ రాయపుర ప్రాంతానికి చెందిన ఎండీ వాజీద్(22)తో పాటు మరో ముగ్గురు యువకులు రెడ్డిపురం కుంటలోకి ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో వాజీద్ ఈతకొడుతూ కుంటలో మునిగాడు. ఆందోళనకు గురైన స్నేహితులు ఈ విషయాన్ని పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. బోటు సాయంతో మృతదేహాన్ని వెలికితీసి కేయూ పోలీసులకు అప్పగించినట్లు హనుకొండ ఎస్ఎఫ్ఓ నాగరాజు, వరంగల్ ఎస్ఎఫ్ఓ రవీందర్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

నానమ్మను చంపిన మనవడు

జఫర్‌గఢ్: అత్త, కోడలి మధ్య జరిగిన గొడవతో ఆగ్రహానికి గురైన మనవడు.. నానమ్మను కత్తితో పొడిచి చంపాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని ఉప్పుగల్లులో జరిగింది. ఎస్సై శీలం రవియాదవ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మామిండ్ల ఎల్లమ్మ (65), తన కోడలు రజిత మధ్య కుటుంబ సమస్యల కారణంగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన మనవడు.. కత్తితో నానమ్మను పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఎల్లమ్మ స్పృహతప్పి పడింది. ఇది గమనించిన కుటుంబీకులు ఎల్లమ్మను వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా,ఈ ఘటనపై మృతురాలి భర్త ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం..

- గుండ్రాతి మడుగు వాసికి తీవ్రగాయాలు
- టెక్సాస్‌కు వెళ్లిన తల్లిదండ్రులు

కురవి/ వరంగల్ క్రైం: అమెరికాలోని టెక్సాస్‌లో శనివారం రాత్రి (భారతీయ కాలమాన ప్రకారం) జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజి)కు చెందిన బండి రోహిత్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బండి అనిల్‌రెడ్డి, అనితారెడ్డి దంపతులు సుమారు 20 సంవత్సరాల నుంచి హనుమకొండలోని సహకారనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు రోహిత్‌రెడ్డి టెక్సాస్‌లో అమెజాన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు రోహన్‌రెడ్డి కూడా అక్కడే ఎంఎస్ చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో రోహిత్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. తీవ్ర గాయాలైన రోహిత్‌రెడ్డిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై తల్లిదండ్రులకు సమాచారం అందడంతో ఆదివారం రాత్రి టెక్సాస్‌కు ప్రయాణమయ్యారు.

బాధితులకు భరోసా ఏది?

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడ్రోజుల క్రితం జరిగిన ఓ ఘటనలో పోలీసుల ఎదుట జరిగిన అన్యాయానికి కూడా పోలీసులు బాధితులకు భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. మూడు రోజులు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా.. కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. ఆస్టేషన్‌లో పని చేస్తున్న ఓ ఎస్సై నిర్లక్ష్యం కారణంగా.. బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ములుగు రోడ్డులోని ఓ ఆటో మొబైల్ షాపునకు మూడు రోజుల క్రితం ఓ వ్యక్తి వచ్చి తనకు కావాల్సిన సామగ్రి తీసుకున్నాడు. వాటికి సంబంధించిన డబ్బులు చెల్లించకుండా వెళ్లేందుకు యత్నించాడు. అతడు పారిపోకుండా నివారించగా.. సదరు వ్యక్తి షాపు నిర్వాహకులపై బూతు పురాణం ఎత్తుకున్నాడు. దీంతో డయల్ 100కు ఫోన్ చేయగా.. ఎస్సైతో పాటు మరికొంత మంది పోలీసులు వచ్చి గొడవ పడిన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాధితులు వెళ్లి ఫిర్యాదు చేశారు. కానీ.. ఎస్సై మాత్రం కేసు నమోదు చేయలేదు. షాపు యజమానులతో గొడవకు దిగిన వ్యక్తి మరోమారు షాపు దగ్గరకు వెళ్లి నాపైనే ఫిర్యాదు చేస్తారా? మీ అంతు చూస్తా.. అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. అయినప్పటికీ పోలీసులు మాత్రం కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

బైక్ రైడర్స్ పై పోలీసుల కొరడా

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా బైక్ రైడర్స్‌పై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఆదివారం వరంగల్ మిల్స్ కాలనీ స్టేషన్ పరిధిలో ఏసీపీ నందిరామ్‌నాయక్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య నేతృత్వంలో.. విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. స్నేక్ డ్రైవ్ చేస్తూ.. ప్రమాదాలకు కారణమవుతున్న బైక్ రైడర్స్‌ను గుర్తించి వారిపై కొరడా ఝుళిపించారు. పట్టుబడిన ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

సైలెన్సర్లు మారిస్తే చర్యలు

రామన్నపేట: భారీ శబ్దం వచ్చేలా సైలెన్సర్లు మార్చి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసకుంటామని వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్ తెలిపారు. సైలెన్సర్‌తో పాటు విపరీతమైన సౌండ్స్ వచ్చే హారన్ వాడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

విద్యారణ్యపురి: తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి నిర్వహించే కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రెన్స్ టెస్టు (సీపీజీఈటీ) ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ప్రవేశపరీక్షకు ప్రిపేరయ్యే విద్యార్థుల కోసం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి రాజారెడ్డి, కెమిస్ట్రీ విభాగం అధిపతి బి రమేష్ తెలిపారు. ఈ శిక్షణ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా ఉంటుందన్నారు. రాష్ట్రంలోని ఏ కళాశాలకు చెందిన విద్యార్థులైనా ఈ శిక్షణను వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఈనెల 17నుంచి ఈ శిక్షణ ప్రారంభించి ఆ ప్రవేశ పరీక్ష వరకు 60 రోజులు కొనసాగిస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 9866962589 నంబర్‌లో సంప్రదించాలని వారు తెలిపారు.

షాట్ పుట్ పోటీల్లో గోల్డ్ మెడల్


మండలోజు కృష్ణమూర్తి

కాజీపేట: సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సీనియర్ సిటిజన్స్ 5వ అథ్లెటిక్స్ ఓపెన్ పోటీల్లో కాజీపేట పట్టణానికి చెందిన మండలోజు కృష్ణమూర్తి బంగారు పతకం సాధించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పోటీల్లో పాల్గొన్నారు. రైల్వేలో సీనియర్ లోకో పైలెట్‌గా విధులు నిర్వర్తించి ఏడేళ్ల క్రితం విరమణ పొందిన కృష్ణమూర్తి.. స్పోర్ట్స్ పట్ల తనకున్న అభిరుచి మేరకు తరుచూ పోటీల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా 8 రాష్ట్రాల నుంచి సీనియర్ క్రీడాకారులతో కలిసి షాట్ పుట్ పోటీల్లో గెలుపొందారు. ఆదివారం రాత్రి డీజిల్ కాలనీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు.. కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు.

పరకాల కాంగ్రెస్‌లో వర్గపోరు


గొడవ పడుతున్న కొండా, రేవూరి వర్గీయులు


కొండా వర్గీయులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

- కొండా, రేవూరి వర్గాల మధ్య ఘర్షణ
- ప్రాధాన్యం దక్కడం లేదని కొండా వర్గీయుల ఆందోళన
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ప్రధాన రహదారిపై బైఠాయింపు

పరకాల: పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో కాంగ్రెస్ వర్గపోరు బట్టబయలైంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో రేవూరి, కొండా వర్గీయుల మధ్య జరిగిన గొడవతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులంతా సమావేశానికి హాజరై మాట్లాడుతున్న సమయంలో కొండ వర్గీయులు(గజ్జి విష్ణు, ఆయన అనుచరులు).. 'జిల్లా టైగర్ కొండా మురళి.. కొండా మురళి నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేస్తూ వేదిక వద్దకు దూసుకొస్తున్న తరుణంలో అక్కడే ఉన్న మిగతా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే వేదికపై నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో మొదటి నుంచి కష్టపడుతున్న వారికి ప్రథమ ప్రాధాన్యత.. ఎన్నికల ముందు చేరి తన గెలుపు కోసం కృషిచేసిన వారికి రెండో ప్రాధాన్యత.. ఎన్నికల తర్వాత గెలిచిన వారికి మూడో ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు. అయితే అప్పటికే గొడవ పడుతున్న ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుని ఒకరిపై ఒకరు పడిపోయి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కావాలని గొడవలు సృష్టిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకుని కొండా వర్గీయుడైన గజ్జి విష్ణుతో పాటు అనుచరులను అదుపులోకి తీసుకున్నాక నేతల ప్రసంగాలు కొనసాగాయి.

గజ్జి విష్ణు అనుచరుల ధర్నా

పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై కొండా మురళి అనుచరులు గజ్జి విష్ణు తదితరులు పరకాల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. సీఐ రవిరాజ్ చేరుకుని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ధర్నాలకు అనుమతి లేదని అడ్డుకున్నారు. హెచ్చరికలను పట్టించుకోకుంటూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనడంతో ఆందోళన విరమించారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం..


స్వర్ణోత్సవ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలి జెడ్పీహెచ్ఎస్ 1973–74 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవ (50 సంవత్సరాల) సంబురాలు నిర్వహించారు. ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ నాటి స్మృతులు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గ్లోబల్ పీస్ అవార్డు విజేత, ఆసియా ఖండం తెలుగు అధ్యక్షుడు మంతేన దామోదరాచారి, గురువులు అనంతారెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తమాచారి, బండి సాంబయ్య, ఎల్లారెడ్డి, లాయర్ అనసూర్య, మాధవరెడ్డి, సూర్యనారాయణ, సారంగపాణి, సదాశివుడు, వీరమల్లు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.